

మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న విశ్రాంత ఉద్యోగులు

## సమస్యలను పరిష్కరించాలని మంత్రి తుమ్మలకు వినతి

కోదాడటౌన్, ఫిబ్రవరి 23 : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు.

ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం మంత్రి కోదాడకు రాగా ఆయన కలిసి సమస్యలను విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, ఆరోగ్య భద్రత పథకం అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా మార్చిలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పింఛన్‌దారుల క్రీడా సాంస్కృతిక ఉత్సవాలకు రావాల్సిందిగా కోరారు. మంత్రి తుమ్మల స్పందిస్తూ వీలైనంత త్వరగా పింఛన్‌దారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, కోదాడ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు, వీరబాబు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

## గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

తుంగతుర్తి, ఫిబ్రవరి 23 : మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం జరిగిన గురుకుల ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 515మందికి గాను 497, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 231 మందికి గాను 223, జనరల్ గురుకుల బాలుర పాఠశాలలో 169మంది విద్యార్థులకు గాను 164మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పాఠశాలలో 515 మంది విద్యార్థులకు గాను 504 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ , ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

## అదనపు ఎస్పీకి ఎస్పీ పరామర్శ



నూతన్ ఫ్లవర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 23 : జిల్లా అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు సతీమణి నూతన్ ఫ్లవర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఏఎస్పీ నాగేశ్వర్‌రావును పరామర్శించి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

## రెండు లారీలు ఢీ



సీతారాంపురం వద్ద ఢీకొన్న రెండు లారీలు

చిలుకూరు, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిపై సీతారాంపురం స్టేజీ వద్ద ఆదివారం రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనగా పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. హుజుర్‌నగర్ నుంచి కోదాడ వైపునకు వస్తున్న లారీ, ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీ కొట్టడంతో ఓ లారీ డ్రైవర్ చెవుల వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. రెండు లారీలు ఒక్కసారిగా ఢీ కొనడంతో హుజుర్‌నగర్ నుంచి కోదాడకు వస్తున్న మరో ఆటో అదుపు తప్పి లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కానిస్టేబుల్ సలీమ్ క్షతగాత్రులను 108లో దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## నేటి ధర్నాను జయప్రదం చేయాలి : సీపీఐ

నేరేడుచర్ల, ఫిబ్రవరి 23 : మండలంలోని చిల్లేపల్లి టోల్‌గేట్ యాజమాన్యం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నేడు టోల్ గేట్ వద్ద నిర్వహించే ధర్నాలో సీపీఐ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ టోల్‌గేట్ పాయింట్ నుంచి 20 కిలోమీటర్ల వరకు ఉన్న అన్ని రకాల ఫోర్ వీలర్లకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాల్సి ఉండగా యజమాన్యం అనుమతి ఇవ్వకుండా లోకల్ వాహనాలకు కూడా టోల్ వసూలు చేస్తున్నారన్నారు. దాన్ని నిరసిస్తూ నేడు అఖిలపక్ష ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నందున సీపీఐ శ్రేణులతో పాటు వాహనదారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సోమగాని వెంకటేశ్వర్లు, రేఖ ఉపేందర్, అంజయ్య ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పేరు మార్పు**

రాపోలు ప్రశాంతి, తండ్రి: క్రిష్ణ కుమార్తె మైనర్ అనగా రాపోలు అన్విక, తండ్రి క్రిష్ణ, వయస్సు:11సం||లు, వృత్తి: విద్యార్థిని, నివాసం, ఇ.నెం.5-26, గ్రా||జాలుకాలువ (గోకారం) మండలం వలిగొండ జిల్లా యాదాద్రి భువనగిరి, ఆదార్ కార్డు ప్రకారం రాపోలు ప్రశాంతి తప్పుగా పడింది దానికి బదులుగా డెటాఫ్ బర్త్ ఉన్నటువంటి పేరు రాపోలు అన్వికగా పేరు మార్పిడి చేయగలరు.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638 |


# న్యూట్రిషన్ కట్!

### నెలలు గడుస్తున్నా న్యూట్రిషన్ కిట్ల సరఫరా శూన్యం
### బీఆర్‌ఎస్ హయాంలో అందించిన కేసీఆర్
### జిల్లాలో వేలమంది గర్భిణులకు అందని కిట్
### పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గర్భిణులకు అందించిన న్యూట్రిషన్ కిట్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 20 : ప్రభుత్వ దవాఖానలకు వచ్చే గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నిలిచిపోయింది. కిట్ల సరఫరా నిలిచిపోవడంతో గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదు. మాతాశిశు మరణాలను తగ్గించడంతో పాటు, సాధారణ ప్రసవాలు పెంచాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసింది. ప్రభుత్వం మారినప్పటి నుంచి న్యూట్రిషన్ కిట్ కట్ అయ్యింది. మిగిలి ఉన్న కొన్ని కిట్లను రెండు నెలల పాటు కొన్నిచోట్ల పంపిణీ చేశారు. ఆ తర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. పౌష్టికాహార కిట్ల కోసం గర్భిణులు దవాఖానలో వైద్యులను అడుగుతుండగా తమకు సమాచారం లేదని చెప్తున్నారు.

**ప్రతి గర్భిణీకి రెండుసార్లు**

పౌష్టికాహార లోపం నివారించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రసవమయ్యే లోపు రెండు సార్లు న్యూట్రిషన్ కిట్లు అందించేవారు. తద్వారా రక్తహీనత, మాతా, శిశు మరణాల రేటును తగ్గించి, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరుగుతాయని భావించింది. ప్రభుత్వ దవాఖానలకు పరీక్షల కోసం వచ్చే వారికే వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు 12 నుంచి 26 వారాల్లోపు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే కిట్లను అందించారు. రెండో కిట్‌ను ప్రసవం కోసం వెళ్లే కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో 24 నుంచి 34 వారాల్లోపు చెకప్ కోసం వెళ్లినప్పుడు అందించారు.

**కిట్లలో ఇవీ**

మొదటి కిట్‌లో మదర్ హార్లిక్స్, ఖర్జూరా ప్యాకెట్, ఐరన్ సిరప్ బాటిళ్లు, నెయ్యి, పల్లి పట్టి ప్యాకెట్లు, ఒక కప్పు, ఒక బాస్కెట్‌లో పెట్టి అందించారు. రెండో కిట్‌లో బాస్కెట్‌కు బదులుగా బ్యాగులో పెట్టి వాటినే అందించారు. ఈ న్యూట్రిషన్ కిట్‌లతో గర్భిణులకు ఎంతో మేలు జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వేలాది మంది గర్భిణులకు కిట్లు అందించాల్సి ఉండగా జిల్లాలో ఒక్క కిట్ కూడా అలందుబాటులో లేదు.

**పౌష్టికాహార లోపం..**

కాంగ్రెస్ పాలనలో పౌష్టికాహార కిట్లు లేకపోవడంతో చాలామంది పేద గర్భిణులు సరైన పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తున్నది. దీంతో ప్రభుత్వ దవాఖానకు వచ్చే వారి సంఖ్య గతంతో పోల్చుకుంటే చాలా వరకు తగ్గిపోతుందని తాజా గణాంకాలు చెబుతున్నాయి.



హుజూర్‌నగర్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

## చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

హుజూర్‌నగర్ , ఫిబ్రవరి 23 : దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను సీఐ చరమందరాజు వెల్లడించారు. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన షేక్ నాగుల్ మీరా, వీసా గోపి, ఖమ్మం జిల్లా చింతకాని గ్రామానికి చెందిన షేక్ అక్బర్ ముగ్గురు కలిసి పట్టణంలోని దద్దనాల చెరువు సమీపంలోని ఒక ఇంట్లో ఇటీవల చోరీకి పాల్పడి బంగారు అభరణాలను ఎత్తుకెళ్లారు. జనవరి 25వ తేదీన సుల్తాన్‌పూర్ తండాలో బంగారు పుసైలతాడు, రెండు ఉంగరాలు, రెండు పుస్తెలు చోరీ చేయగా పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా దొంగలను పట్టుకున్నారు. వీరు గతంలో అనంతగిరి, కోదాడ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చోరీలు చేసినట్లు తెలిపారు.

ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి చోరీకి గురైన సొమ్మును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వాటి విలువ సుమారు రూ.2.30 లక్షలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మఠంపల్లి ఎస్ఐ బాబు, సిబ్బంది నాగరాజు, శంభయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 23 : గత ఆరేళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో, బయట ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా నిజాయతీగా పని చేశానని, మొదటి ప్రాధాన్యత ఓటు తనకే వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి అల్లుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. స్థానిక టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల క్లీనింగ్‌కు ప్రత్యేక గ్రాంటు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ ప్రభుత్వమే చెల్లించేలా పోరాడానని గుర్తు చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 2020 పీఆర్సీ, సెలవులు మంజూరు, బదిలీలు తదితర సమస్యల పరిష్కారంలో కృషి చేసినట్లు తెలిపారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రామనర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్.భిక్షం, టీజీజేఎల్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్లు, ఎం.పూర్ణచందర్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, ఎస్.అనిల్‌కుఏమార్, జె.యాకయ్య పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుంగతుర్తి, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాలలో 2002-03 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని పద్మశాలి భవన్‌లో సమ్మేళనమయ్యారు. 22 సంవత్సరాల తర్వాత కలువడంతో మిత్రులు ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని, ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణయ్య, హెచ్‌ఎం మల్లయ్య, ఉపాధ్యాయులు నసీరుద్దీన్, సోమన్న, వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, వెంకన్న, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

## మార్చి 2న మల్టీపర్పస్ హైస్కూల్ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న గుంటకండ్ల దామోదర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 23 : సుమారు 60 ఏండ్ల క్రితం సూర్యాపేట మల్టీ పర్పస్ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మార్చి 2న స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 2న జరిగే ఆత్మీయ సమ్మేళనానికి హాజరు కావడానికి దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నట్లు తెలిపారు. తెలిపారు. కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, అఖిల భారత లాయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి తాటి చంద్రశేఖర్, కన్వీనర్ వేణూధర్, పెండెం రాములు, రుద్రంగి సత్యనారాయణ, చిలువేరు రఘురాం పాల్గొన్నారు.

## ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి : విజయ్

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 23 : హైదరాబాద్‌లోని కొంగరకలాన్ ఇండస్ట్రీ ఏరియాలో ప్రముఖ ఎలక్ట్రానిక్ ఎంఎన్‌సీ ఐఫోన్ కంపెనీలో భారీగా ఉద్యోగ అవకాశాలున్నాయని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రుచిత అసోసియేట్ సభ్యుడు విజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో ఆదివారం జాబ్ మేళా నిర్వహించి పలువురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18-30 వయస్సు గల నిరద్యోగ యువత పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమా చేసిన వారు అర్హులు అని తెలిపారు. ఈ కంపెనీలో సుమారు 2వేల ఉద్యోగాలు వరకు ఖాళీలున్నాయని అందు కోసం యువత నుంచి దరఖాస్తులు స్వీకరించి చదువుకు తగిన ఉద్యోగం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.15171 వేతనంతో పాటు రెండుసార్లు భోజనం, ఉచిత బస్సు, హాస్టల్ వసతి కోసం రూ.2వేలు అదనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు 9347766349, 6300499852, 80084 55311 నంబర్లను సంప్రదించాలని కోరారు.



సంతాపసభలో మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

## జానయ్య జీవితం స్ఫూర్తిదాయకం – నాగార్జునరెడ్డి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 24 : అంజనపల్లి జానయ్య జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెట్ల ముకుందాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఎం సీనియర్ నాయకుడు జానయ్య సంతాపసభలో ఆయన హాజరై మాట్లాడారు. అనేక పోరాటాలు, త్యాగాలకు నిలయమైన చెట్ల ముకుందాపురంలో సామాన్య, వ్యవసాయ కార్మిక కుటుంబంలో పుట్టిన జానయ్య, తన జీవితాంతం నమ్మిన సిద్ధాంతం కోసం పని చేసినట్లు గుర్తు చేశారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, ముల్కలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, ధనియాకుల శ్రీకాంత్, వట్టపు సైదులు, మిట్టగనుకుల ముత్యాలు, షేక్ సైదా, స్వరాజ్యం, వెంకటేశ్వర్‌రావు, బుర్రి శ్రీరాములు, బి.రాంబాబు, రణపంగ కృష్ణ, అంజిబాబు, కొండమీది రాములు, గుర్రం గోపాల్‌రెడ్డి, గోపిరెడ్డి, సైదులు, విజయ్‌కుమార్, దనియాకుల శ్రీను ఉన్నారు.

## నేటి నుంచి బీఈడీ రెండో విడుత ప్రాక్టికల్ పరీక్షలు

రామగిరి, ఫిబ్రవరి 23: ఎంజీయూ పరిధిలోని బీఈడీ గ్రూప్-బీ కళాశాలల్లో ఈ నెల 24, 25 తేదీల్లో మూడో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల్లోని విద్యార్థులకు నిర్వహించే ఫైనల్ టీచింగ్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు చేస్తాయని తెలిపారు.



ఆత్మకూర్.ఎస్‌లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## వధూవరులకు మాజీ మంత్రి ఆశీర్వాదం

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన చక్కల వెంకన్న కుమారుడి వివాహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అదే విధంగా ఆత్మకూర్.ఎస్‌లో గంగాభవాని మొదటి వార్షికోత్సవ జాతర మహోత్సవంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, యాదవయాదవ సంఘం నాయకులు మాజీ మంత్రిని సన్మానించారు.



వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

## ఘనంగా మోడల్ స్కూల్ వార్షికోత్సవం

గరిడేపల్లి, ఫిబ్రవరి 23 : మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో గల పీఎం శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో వార్షికోత్సవం, క్రీడా, వీడ్కోలు సమావేశ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ పాఠశాలల డిప్యూటీ డైరెక్టర్ నెల్లూరు దుర్గాప్రసాద్ ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదుగాలన్నారు. గురువులు, సమాజం పట్ల మంచి వైఖరిని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా జె.ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు నాగరాజు, సతీశ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, శైలజ, శాంతిప్రియ, మల్లికార్జునరెడ్డి తదితరులున్నారు.



నేరేడుచర్ల : దిర్శించర్ల ప్రభుత్వ పాఠశాలకు ఉచితంగా రంగులు వేసిన సిబ్బంది

## ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 23 : మండలంలోని దిర్శించర్ల ప్రభుత్వ పాఠశాలకు పట్టణంలోని జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్, రామకృష్ణ ఐరన్ సిండికేట్ ఆధ్వర్యంలో ఆదివారం రంగులు వేశారు. పాఠశాల భవనం రంగు తేలిపోయి ఉండడంతో హెచ్‌ఎం అభ్యర్థన మేరకు స్పందించిన ఐరన్ సిండికేట్ యజమాని శేఖర్.. సొంతంగా పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. అదే విధంగా మరింత మంది దాతలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని కోరారు.



ఉచిత కాలేయ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

## ఉచిత వైద్య శిబిరం

కోదాడటౌన్, ఫిబ్రవరి 23 : పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల కేర్ డయాగ్నస్టిక్ అండ్ స్కాన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత లివర్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ మట్టా రాకేశ్ మాట్లాడుతూ కాలేయ వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా తరుచూ పరీక్షలు చేసుకుంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. వైద్య శిబిరంలో 200 మందికి పైగా రోగులకు సేవలను అందించినట్లు తెలిపారు.

## ఆర్యవైశ్యులు ఆదర్శంగా నిలువాలి : వెంకటేశ్వర్‌రావు




వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కోదాడటౌన్, ఫిబ్రవరి 23 : ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో అగ్రభాగాన నిలుస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలువాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా కార్యవర్గ పదవుల నియామకం కోసం ఆర్యవైశ్య సంఘం కోదాడ పట్టణ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కార్యవర్గాన్ని నియమించి త్వరలో జిల్లా కేంద్రంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గంలో ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు పైడిమర్రి నారాయణరావు, కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, సంయుక్త కార్యదర్శి అశోక్, యూత్ అధ్యక్షుడు బొమ్మిడి రాజా, కుక్కడపు బాబు, సత్యనారాయణ, జగని ప్రసాద్ పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా తప్సీ గాంధీ**

సూర్యాపేటటౌన్ : జిల్లా ఆర్యవైశ్య మహాసభల ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు తప్సీ గాంధీ, బజ్జూరి దయాకర్ నియామకమయ్యారు. మహాసభ అధ్యక్షుడు వంపటి వెంకటేశ్వర్‌రావు వీరికి నియామకపత్రాలు అందించారు.

## వివాహిత ఆత్మహత్య



మనీష(ఫైల్)

మద్దిరాల, ఫిబ్రవరి 23 : మండలంలోని పోలుమల్ల గ్రామానికి చెందిన వివాహిత హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆకుల మల్లేశ్-సరస్వతిల పెద్ద కుమార్తె మనీష(23) గతేడాది తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన సంపత్‌ను ప్రేమ వివాహం చేసుకొని రామంతాపూర్‌లో నివాసం ఉంటున్నది. వివాహం జరిగిన నాటి నుంచి మనిషాను సంపత్ వేధిస్తున్నాడు. వేధింపులు తాళలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయం చేసి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మనీష తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గాంధీ దవాఖానలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.